# మారుమనస్సు పొందు లేదా నశించిపో !

## (లూకా 13:1-5)

ఒక రోజు ప్రభువైన యేసు బోధిస్తున్నారు "పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపి"న సంగతి ఆయనకు రిపోర్టు చేయబడింది (లూకా 13:1). ఈ గలిలయులెవరో మనకు తెలియదు.[1] ఆ విధంగా చంపబడడానికి వారు అతి దుష్టులై యుండాలని ఆయన శ్రోతలు భావించారు. అందుకు ప్రభువు వారికి యిలా బదులిచ్చారు: "ఈ గలిలయులు అట్టి హింసలు పొందినందున వారు గలిలయులందరికంటె పాపులని మీరు తలంచుచున్నారా? కారని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" (2, 3 వచనాలు). అదే విషయాన్ని నొక్కి చెప్పడానికి ప్రభువు రెండవ ఉదాహరణను యిలా ఉపయోగించారు: "మరియు సిలోయములోని గోపురము పడి చచ్చిన ఆ పదునెనిమిదిమంది, యెరూషలేములో కాపురమున్న వారందరికంటె అపరాధులని తలంచుచున్నారా? కారని మీతో చెప్పు చున్నాను; మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" (4, 5 వచనాలు).[2]

బైబిల్లో నకలు తీసినట్టు చెప్పబడిన వచనాలు తక్కువ. మాటకు మాటగా నకలు తీసిన రెండు వచనాలు లూకా 13లో[3] ఉన్నాయి: 3వ వచనం యిలా అంటుంది: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు." 5వ వచనం కూడ అలాగే అంటుంది: "మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు." "మారుమనస్సు పొందండి లేదా నాశనం కాండి" అనే సందేశాన్ని పొందడంలో తప్పిపోకుండాలని పరిశుద్ధాత్మ యిలా నకలు తీయడంవలన తెలియ జేయబడుతుంది.

### "మీరు మారుమనస్సు పొందని యెడల ..."

**మారుమనస్సు ఆదేశించబడింది**

పాత, క్రొత్త నిబంధనలలో[4] మారుమనస్సు యొక్క అవసరత నొక్కి చెప్పబడింది. పరలోక రాజ్యము సమీపించియున్నదని బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించుచు వచ్చి, మారుమనస్సు పొందుడని జనులను హెచ్చరించాడు (మత్తయి 3:2). క్రీస్తు ప్రభువును

ఆయన అపొస్తలును అదే సందేశం యిచ్చారు (మత్తయి 4:17; మార్కు 6:12). ప్రభువు గ్రేట్ కమిషన్ (ఘనత్వముగల ఉత్తరువు) జారీచేసినప్పుడు, ప్రకటించవలసిన సందేశంలో మారుమనస్సు భాగంగా ఉంది (లూకా 24:47).[5] సువార్త సంపూర్ణమైన రూపంలో తొలిగా ప్రకటింపబడినప్పుడు, పాపులు మారుమనస్సు పొందవలసిందిగా ఆదేశింప బడ్డారు (అపో. 2:38; 3:19, 26; 17:30, 31).

మారుమనస్సు పై బైబిలు ఎక్కువగా నొక్కి పలకడానికి కారణం, లోబడడానికి అది అతిక్రమించలేని ఆజ్ఞగా జనులు భావిస్తారన్నట్టు చెప్పబడింది. రుజువును గ్రహించారంటే నమ్మడానికి సమస్య ఉండదు. ఉదాహరణకు దేవుడు ఉన్నాడనే నమ్మకం మన దేశంలో ఎక్కువ మందికి ఉంది – వారిలో బహు తక్కువ మంది యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని విశ్వసిస్తారు.[6] పోతే జనులు నిజంగానే మారుమనస్సు పొందారనుకో, మిగిలిన ఆజ్ఞలకు లోబడడంలో సమస్య ఎక్కువగా ఉండదు. ఏదియెలాగున్నా, మారుమనస్సు అనేదే కష్టం – బహు కష్టం!

కనీసం రెండు కారణాలను బట్టియైనా మారుమనస్సు కష్టమని చెప్పవచ్చు: మొదటిది, మారుమనస్సు పొందాలనడం మన అహాన్ని దెబ్బదీస్తుంది – జనులు గర్వముతో నిండియుంటారు.[7] రెండవది, నిజమైన మనస్సు ఒక వ్యక్తి యొక్క జీవిత విధానంలో మార్పుకోరుతుంది – మనం మార్చుకొనడానికి యిష్టపడం; దీని సంగతి మనం చూడబోతాం. అందువలన, మనలో ఎక్కువమంది, మారుమనస్సు పొందడం కష్టంగా భావిస్తారు. “మానవ రక్షణకు బహు గొప్ప అడ్డంకు మానవ చిత్త కాఠిన్యమే”యని J. W. McGarvey రాశాడు.[8]

## మారుమనస్సు నిర్వచింపబడింది

మనం ముందుకు సాగక మునుపు, మారుమనస్సు అంటే ఏమో తీర్మానించాలి. “నేను పాపం చేశాను సారీ” అనేది “మారుమనస్సు” అని తరుచుగా మతసంబంధమైన ప్రజలు నిర్వచిస్తారు.[9] గత పాపముల విషయమై పశ్చాత్తాప పడకుండు మారుమనస్సు పొందలేడనేది సత్యం. కాని పాపములు కొరకైన విచారమే మారుమనస్సు కాదు. నిజంగా మారుమనస్సు పొందకయే ఒకడు పశ్చాత్తాపపడవచ్చు.

ఈ దృశ్యాన్ని ఊహించు (మీలో కొందరు దీనితో గుర్తింపజేసికోవచ్చు). బంధువులు అతిథులు వచ్చారు. వారికొరకు తల్లి మంచి రుచిగల పిండి వంటలు చేసి, వేడి వేడిగా భోజనం బల్లమీద ఉంచి. “వాటి దగ్గరకు పోవద్దని” తన చిన్న బిడ్డకు తల్లి ఆదేశించింది. అయితే ఆ పిండి వంటలు ఆ పిల్లవాడికి చాల యిష్టమైనవి. వాటి సువాసన వానికి నోరూరిస్తోంది, గనుక తన తల్లి బయిటికిపోయి తిరిగి వచ్చేలోపుగా ఆ ప్లేటులో సగం మాయమయ్యాయి. దోష భరితమైన చూపు ముక్కలు క్రింద మీద పడియుండడం తల్లి చూచింది. ఆ పసివాడు పశ్చాత్తాపపడి ఉంటాడా? అవును, అతడు పట్టుపడినందుకు పశ్చాత్తాపపడియుంటాడు. తన తల్లి మాట విననందుకు ఏమి జరుగబోతుందో ఎరిగి పశ్చాత్తాపపడతాడు. మరల రేపు అమ్మ ఎక్కువ వంటకాలు ముందులాగే చేసిందనుకో? ఆలాటి పరిస్థితే తిరిగి జరిగే అవకాశముందా? జరుగవచ్చు. ఎందుకు? ఎందుకంటే

ఆ బాలుడు పశ్చాత్తాపపడ్డాడే గాని మారుమనస్సు పొందలేదు.

నన్ను అపార్థం చేసికోవద్దండి. తప్పుచేశానని పశ్చాత్తాపం కలగడం బహు ముఖ్యమైన సంగతి. వాస్తవంగా, "మారుమనస్సు విధానం" అని నేను పిలిచేదానికి యిది అత్యవసరం. ఏదియెలాగున్నా, అది ప్రయోజనకరమైన ఫలితాన్ని యివ్వడానికి ముందు ఆ దుఃఖము లేక పశ్చాత్తాపమనేది ఫలాని రకమైయుండాలి. రెండవ కొరింథీ. 7:9, 10లో దీనికి సంబంధించిన సందేశం ఉంది. తన గత పత్రిక తాను ఖండించిన విషయాన్ని సూచించుతూ, పౌలు యిలా రాశాడు,

> మీరు దుఃఖపడితిరని సంతోషించుట లేదు గాని మీరు దుఃఖపడి మారుమనస్సు పొందితిరని యిప్పుడు సతోషించుచున్నాను. ఏలయనగా ఏ విషయములోనైనను మావలన మీకు నష్టము పొందకుండుటకై, దైవచిత్తానుసారముగా దుఃఖపడితిరి. దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును; ఈ మారుమనస్సు పశ్చత్తాపమును పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును.

తాము పాపం చేసినట్టు కొన్నిసార్లు జనులు పశ్చాత్తాపపడినట్టు చెప్పుకుంటారు, కాని వారి పశ్చాత్తాపము లేక "దుఃఖము లోకసంబంధమైనది." తమ తప్పులో తాము పట్టబడ్డారు, తమ చర్యలకు ప్రతిఫలం అనుభవించాలనే దృష్టితో దుఃఖపడతారు. అయితే, వారు నిజంగా మారుమనస్సు పొందలేదు.[10] దీనికి భిన్నంగా "దైవ చిత్తాను సారమైన దుఃఖం" ఉంది. "దైవచిత్తానుసారమైన దుఃఖం ఎలాటిది"? Jim Allen యిలా రాశాడు,

> నేను దాన్ని సరిగ్గా అర్థం చేసికొన్నట్టయితే, మనం దేవుని మనస్సును నొప్పించామని దుఃఖపడి పశ్చాత్తాపపడడమైయుంటుంది. దాని విషయమై మనం శిక్షింపబడినా లేకున్నా, అందునుబట్టి మనం పశ్చాత్తాపపడ్డాం. దేవుని మహా ఘనమైన హృదయాన్ని కాళ్లక్రింద త్రొక్కాం. ఆయనను అవమానపరచి మనస్సును నొప్పించామని ఎరిగినప్పుడు, మన హృదయం పగిలిపోతుంది.[11]

ఈలాటి దుఃఖము మారుమనస్సును పుట్టిస్తుందని పౌలు తెలిపాడు – అదే మారు మనస్సు కాదు సుమీ, అది మారుమనస్సును "పుట్టిస్తుంది" లేక కలిగిస్తుంది.[12] పెంతెకొస్తు దినమున ప్రభువైన యేసును గూర్చి పేతురు ప్రసంగించినప్పుడు (అపొ. 2:14-36), అతని శ్రోతలలో అనేకుల "హృదయమునకు గుచ్చుకుంది" (అపొ. 2:37); వారు తమ పాపముల విషయమై ఒప్పింపబడ్డారు. వారు యేసును సిలువవేయించినందుకు పశ్చాత్తాపపడ్డారని మనం నిరాక్షేపంగా చెప్పవచ్చు. అయినప్పటికిని, మారుమనస్సు పొందనవసరముందని వారు చెప్పబడ్డారు (అపొ. 2:38). పాపముల విషయమైన పశ్చాత్తాపమే మారుమనస్సు కాదు.

"ఏది తప్పో దాన్ని చేయడం మానివేసి, ఏది ఒప్పో దాన్ని చేయనారంభించు అనేది దాని అర్థం"[13] అని మతసంబంధమైన కొందరు "మారుమనస్సు యొక్క నిర్వచనంగా" చెప్పుతారు. "మారుమనస్సు విధానంలో" జీవితపు మార్పు అనేది ఒక అత్యవసరమైన

విషయమై యుంటుంది కాని, జీవితపు మార్పే మారుమనస్సు కాదు. ఒకడు తన జీవితాన్ని మార్చుకున్నా, ఎన్నడూ మారుమనస్సు పొందకుండ ఉండే అవకాశముంది. తన జీవితం అసహ్యంగా ఉంది, దిగజారుతుందని గమనించిన ఒక వ్యక్తి – మారుమనస్సు పొంద కుండగనే – తన జీవిత విధానాన్ని మార్చుకోవచ్చు. అతని మార్పుకు హేతువైయుంది గర్వం, దేవునికి అవిధేయుడనయ్యాననే పశ్చాత్తాపం కాదు.

మరల, నన్ను అపార్థం చేసుకోకండి సుమీ. జీవితపు మార్పు ముఖ్యమే, అత్యవసరం కూడ, అలాటి మార్పు నిజమైన మారుమనస్సువలన కలిగే ఫలితమని బైబిలు బోధిస్తుంది. బాప్తిస్మమిచ్చు యోహాను తన శ్రోతలకు: "మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి" అని తెలియజేశాడు (లూకా 3:8ఎ). "ఫలము" అనేది వారి జీవితముల మార్పు అని అతడు సూచించాడు (లూకా 3:10-14 చూడు). "నీనెవె వారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి" (మత్తయి 12:41) అని ప్రభువు తెలిపారు. వారు మారుమనస్సు పొందినట్టు మనకెలా తెలుసు? ఎలాగంటే, "నీనెవెవారు తమ చెడునడతలను మానుకొనగా" (యోనా 3:10).[14] ఒకడు మారుమనస్సు పొందానని చెప్పి, తన జీవిత విధానంలో మార్పు విదితమైయుండక పోతే, అతడు నిజంగా మారుమనస్సు పొందాడో లేదో ఆశ్చర్యపోతారు.

"మారుమనస్సు పొందే మార్గంలో" జీవితపు మార్పు – అవును – అవసరమే. మారుమనస్సు అనేది అలాటి మార్పును కలిగిస్తుంది.[15] అయినా, జీవితపు దిద్దుబాటు, తనంతట అదే, మారుమనసైయుండదు.

అప్పుడు, ఉద్భవించే ప్రశ్న ఏమంటే – "మారుమనస్సు అనేది పాపముల విషయమై పశ్చాత్తాపము కాకుంటే, మరియు తప్పుచేయమానుకొనడం కాకుంటే, యింతకు అదేమైయుంటుంది?" ఇక్కడ సంక్షిప్త పద పరిశీలన చేయనిమ్ము:

> "మారుమనస్సు" అనేది ఒక సంయుక్త గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది. (*metanoeo*). ఇందులో "తరువాత" (*meta*) అనేదానితో "ఆలోచన" (*noema*) అనేది అతికించబడింది. "తరువాత ఆలోచన" అనేది దాని అక్షరార్థం. ఒకని ఆలోచనలోనే మార్పును అది సూచిస్తుంది. ఇది మనిషికి వర్తింపజేసినప్పుడు, పాపమును గూర్చి ఒకని మనస్సులో కలిగిన మార్పు – సాధారణంగా పాపం చేయ మానివేయడం మరియు/లేదా నిర్దిష్టమైన పాపాన్ని చేయమానుకొనడం.[16]

"మారుమనస్సు విధానాన్ని" రివ్యూ చేద్దాం. దైవచిత్తానుసారమైన దుఃఖము మారు మనస్సు కలుగజేస్తుంది, అంటే, మనస్సు మార్పు లేక స్వభావం మార్పు. మనస్సు మార్పు, తప్పక, జీవితపు మార్పుగా పరిణమిస్తుంది.[17] ఈ విధానాన్ని ఉదాహరించే ఒక కథను ప్రభువు తెలిపారు[18] మత్తయి 21లో, తన కుమారులలో ఒకనిని చూచి, "– కుమారుడా, నేడుపోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు – పోను అని ఉత్తరమిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను" (28, 29ఎ వచనాలు). "తరువాత అతడు మారుమనస్సు పొంది పోయెను" అని KJV అంటుంది. "తరువాత అతడు తన మనస్సు మార్చుకొని పోయెను"[19] అని NIV అంది.[20]

మారుమనస్సును "అప్పగించుకొను," లోబడిపోవు అనేదానితో సంగ్రహము చేయవచ్చునని Allen అంటాడు:

> జీవితంలో నీకున్న స్వార్థపరమైన కోర్కెలకు అభ్యుదయేచ్ఛలకు, అభిలాషలకు మృతినొందినవాడవై, నీకు కలిగినది అంతా, భవిష్యత్తులో నీవు పొందబోయేదంతా సర్వశక్తుడగు దేవుని బలిపీఠంమీద అర్పణచేయి (నీ తిరుగుబాటు) ఆయుధములను కట్టకట్టి ప్రభువునకు అప్పగించుకో.[21]

## "... మీరందరును ఆలాగే నశింతురు"

### సార్వత్రికమైన పర్యవసానాలు

ప్రభువుకు మనలను మనము లోపరచుకొనడం అవసరమా? మన పాపముల విషయంలో మనం మారుమనస్సు పొందకుంటే ఏమి జరుగుతుంది. ప్రభువు వారి చివరి ప్రతిపాదనను చూడు: "కారని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3). "అందరు" అనే మాటను గమనించు. తమ పాపములు పిలాతు చంపిన గలిలయులంత చెడ్డవికావని ప్రభువు యొక్క శ్రోతలు తలంచినట్టున్నారు. అయితే, పాపమంటే పాపమేయని పాపమంతా సర్వశక్తుడగు దేవుని అవమానించునదేయని వారు తెలిసికోవాలని ప్రభువు కోరారు.[22]

"అందరు పాపము" చేశారు (రోమా 3:23); గనుక, అందరు మారుమనస్సు పొందవలసిందే. క్రైస్తవులవ్వడంలో మారుమనస్సు అత్యవసర భాగమైయుంది (అపొ. 2:38; 3:19). అంతేకాదు, నమ్మకమైన క్రైస్తవ జీవితంలో అది అవసరమైన భాగమైయుంది (అపొ. 8:22; 2 కొరింథీ. 7:9, 10; హెబ్రీ. 6:6).[23] పౌలు యిలా అన్నాడు: "ఇప్పుడైతే, అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని (దేవుడు) మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ. 17:30).

### ఆగని పర్యవసానాలు

ఒకడు ప్రభువునకు లోబడనొల్లకుంటే ఏమి జరుగుతుంది? "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3, 5) అని క్రీస్తు తేటగా చెప్పారు. అంటే, మారుమనస్సు పొందకుంటే పిలాతు వారిని చంపుతాడనిగాని, గోపురం వారిమీదికి కూలిపడుతుందని గాని ప్రభువు తన శ్రోతలకు తెలియజేయలేదు. మారుమనస్సు పొందనొల్లనందున రాబోయే ఆత్మసంబంధమైన పర్యవసానాలను గూర్చి ప్రభువు మాట్లాడుతున్నారు. "మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" అని క్రీస్తు మరొక చోట అన్నారు (మత్తయి 10:28).

గతకాలంలో, అనేకుల అభిమానాన్ని చూరగొనిన సిద్ధాంతం ఏమి చెప్పిందంటే - వారు మారుమనస్సు పొందునట్టు బలవంతపెట్టే, ఆత్మసంబంధమైన ఎదిరింప శక్యముకాని ఉత్సాహశక్తి లేక ఉద్వేగమును ప్రజల హృదయాల్లోనికి దేవుడు పంపుతాడు అనేది.[24] ఒకవేళ అదే నిజమైయుంటే "దేవుడు పక్షపాతి కాడు" (అపో. 10:34) కదా? (అందరికి అది వర్తించాలి) అది కాదు గనుకనే - "ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని" కోరుచున్నాడు ( 2 పేతురు 3:9). అందరును మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నాడు గాని, అలా చేయ నిర్ణయించుకునేది మనమే. మారుమనస్సు పొందాలని మనలను ప్రోత్సహించడానికి దేవుడు మనయెదుట రెండు ప్రధానమైన విషయాలను నిలుపుతాడు.

వాటిలో మొదటిది ఆయన మంచితనపు సంతోషపు కథను మన ఎదుట ఉంచుతాడు: పౌలు యిలా రాశాడు, "లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరింతువా?" (రోమా 2:4). McGarvey యిలా రాశాడు,

> క్రొత్త నిబంధన ప్రత్యక్షతలతో పరిచయమున్న దేవుని ఎరిగియున్న పాపి ఎపుడైనా … కూర్చుండి, తన్ను సృజించిన దేవుని దయను తలపోసి; తన చిన్ననాటినుండి తనపై కనుపరచిన కృపాకనికరములను గుర్తుచేసికొని; దేవుడు తన రక్షణకు మార్గం ఏర్పాటు చేశాడన్న వాస్తవముపై, తన పాపములనుండి మరలి క్రీస్తునందున్న విశ్రాంతికిని సమాధానానికిని (శాంతికిని) తన్ను పిలుస్తున్నాడనియు, ఆయన తన నిత్య మహిమను, మహదానందము, ఘనతకు నిత్యత్వపు ద్వారాలను తెరిచియుంచాడని ఒకడు ఎప్పుడైనా తలపోసియుంటే, తాను పాపియైయున్నందుకు తన్నుతాను అసహ్యించుకొనకుండ ఎప్పుడైనా ఉండగలడా?[25]

ఏదియెలాగున్నా, మనుష్యులను మారుమనస్సుకు నడిపించడానికి దేవుడు తన ఉగ్రతను కూడ ఉపయోగిస్తాడనేది విచారకరమైన సత్యం. "దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు వారిని నడిపిస్తుందన్న సత్యాన్ని" పౌలు రోమీయులకు తెలియజేసిన మీదట, అతడు యిలా రాశాడు,

> నీ కాఠిన్యము, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు. ఆయన ప్రతివానికి వాని వాని క్రియలు చొప్పున ప్రతి ఫలమిచ్చును (రోమా 2:5, 6).

నశించిపోవుటను గూర్చి ప్రభువు తన శ్రోతలను హెచ్చరించినప్పుడు ఆయన ఉపయోగించిన విధానమిది. నరకాన్ని గూర్చి మాట్లాడి మన శ్రోతలను మనము ఎప్పుడే "భయపడేలా" చేయకూడదని కొందరు తలంచుతారు. నీవు ఒకవేళ ఆ విధంగా భావించితే, దీన్ని ఆలోచన చేయి: తక్కిన దైవప్రేరేపితులలో ప్రవక్తలకంటెను, రచయితల కంటెను ఎక్కువగా నరకాన్ని గూర్చి ప్రభువే మాట్లాడారు. మన అవిధేయతకు కలిగే లేక వచ్చే

పర్యవసానాన్ని గూర్చి ఆలోచించడానికి మనం యిష్టపడము గాని తప్పదు!

## ముగింపు

పరలోకము సిద్ధపడినవారికి సిద్ధపరచబడిన స్థలం[26] ఎలాగో, అలాగే నరకం కూడ.[27] నీవు ఉన్నపాటునే రెండింటిలో ఏదో ఒకదానికి సిద్ధపడుతున్నావ్, నీవు పరలోకానికి వెళ్ల సిద్ధమౌతున్నావా? – లేక నీ హృదయంలోను, జీవితంలోను పాపాల విషయంలో నీవు మారుమనస్సు పొందవలసి ఉందా?

ఒకానొక పట్టణాన్ని ప్రభువు ఒకప్పుడు యిలా గద్దించారు: "... విమర్శ దినమందు నీ గతికంటె సొదొమ దేశపువారి గతి ఓర్వతగినదై యుండునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 11:24). ఎందుకు? సొదొమవారికి అనుగ్రహింపబడిన దానికంటె, ఆయన బోధించిన వారికి మారుమనస్సు పొందడానికి ఎక్కువ అవకాశాలు యివ్వబడినందున – అయినను వారు ఆ అవకాశాలను నిరాకరించారే. నీవు గుర్తించలేకపోవచ్చు గాని, నీవు అంతకంటే అపాయకరమైన చోట నేడు కూర్చున్నావ్. మారుమనస్సు పొందుతావో లేక నశించిపోతావో కోరుకునే అవకాశాన్ని ప్రభువు నీ వద్దకు తెచ్చారు. నీవు మారుమనస్సు పొందకుంటే – నీవు నశించిపోతే – నిరుత్తరుడవై యున్నావు.

ఒకానొక వ్యక్తిని గూర్చి ప్రభువు యిలా అన్నారు: "మారుమనస్సు పొందుటకు నేను దానికి సమయమిచ్చితిని గాని అది తన జారత్వమును విడిచిపెట్టి మారుమనస్సును పొందనొల్లదు" (ప్రకటన 2:21). మారుమనస్సు పొందడానికి దేవుడు యిప్పుడు నీకు సమయమిచ్చాడు. "మారుమనస్సు పొందనొల్లడు" (దు) అని నీ విషయమై చెప్పకుండాలని నా కోర్కె. అలా జరగాలనుకుంటే ఆ పని చేయి.[28]

---

సూచనలు

[1]ఈ గలిలయులు ఎవరు అనే విషయం కొరకు "క్రీస్తు జీవితం, 6"ను చూడు. [2]లూకా 13:1–5లపై చర్చకొరకు "క్రీస్తు జీవితం, 4" ను చూడు. [3]ఇక్కడ యింకా రెండు ఉన్నాయి: సామెతలు 14:12, 16:25. [4]ఉదాహరణకు, 1 రాజులు 8:47; యెహెజ్కేలు 14:6; 18:30. [5]గ్రేట్ కమిషన్‌లో లూకా 24:47 స్థానం "గుడ్‌బై – మరియు హలో" అనే పాఠంలో చూడు. [6]వీరందరికి దేవునియందు, దేవుని కుమారునియందు సరియైన విశ్వాసముందని కాదు. [7]గర్వమనే పాపం మీద కొన్ని లేఖన భాగాలు: సామెతలు 16:18; 29:23; 1 యోహాను 2:16. [8]J. W. McGarvey, *Sermons* (Cincinnati: Standard Publishing Co., 1893; reprint, n.d.) 97. [9]"మారుమనస్సు"ను నిర్వచించమని మతేతరులను అడిగిన యెడల సమాధానం ఏమీ ఉండదు. [10]దీనికి పలు ఉదాహరణలను ఉపయోగించవచ్చు: దొరికిన దొంగ; దొంగతనం మానని స్థితి, ఆలాగే త్రాగుబోతు.

[11]Jimmy Allen, "Repentance," *What Is Hell Like? and Other Sermons* (Dallas: Christian Publishing Co., 1965), 164. [12]"మారుమనస్సు విధానము"ను గూర్చి "రక్షణను గ్రహించుట" అనే పుస్తకములోని రేఖా చిత్రాన్ని చూడు. [13]కొందరు ఈ రెండు నిర్వచనాలను కలిపి వేస్తారు: "పాపం చేసినందుకు పశ్చాత్తాపపడు, పాపం చేయడం మాని సరిగా బ్రదుకనారంభించు." [14]పౌలు, జక్కయ్య, ఫిలిప్పీ, చెరసాల నాయకుడువంటి యితర ఉదాహరణలు యివ్వవచ్చు. [15]జీవితంలోని మార్పు యొక్క అవసరతను నొక్కి చెప్పు. ఉదాహరణకు దొంగిలించినవాడు సొత్తును సొత్తుగలవానికి తిరిగి ఇవ్వవలెను. [16]"కార్య గ్రంథం, 1"లోని గ్లోసరీలో "మారుమనస్సు" అనే పదాన్ని చూడు. [17]మారుమనస్సు

పొందిన తోడనే మార్పంతా తెలియబడకపోవచ్చు, అయితే కొంత మార్పు విదితమైయుంటుంది. ప్రభువునందు జీవితాంతం ఒకడు ఎదుగుతూ ఉండవలసిందే. [18]తప్పిపోయిన కుమారుడనబడే ఉదాహరణను కూడా ఉపయోగింపవచ్చు (లూకా 15:17, 18). [19]"పశ్చాత్తాపము" (NASB) "మారుమనస్సు" (KJV) "మనస్సును మార్చుకొను" (NIV) అని తర్జుమా చేయబడిన పదాలు గ్రీకు పదానికి దగ్గర సంబంధమున్న పదాలే. [20]కొంత మంది సువార్తికులు ఇలా వివరిస్తారు: "లెక్క యొప్పచెప్పవలసిన యౌవన వయసుకు ముందు దేవునివైపు నడుచుచుంటిమి." "యౌవన వయస్సుకు వచ్చినప్పుడు నూటా ఎనభై డిగ్రీలు మలుపుతిరిగి దిశను మార్చి దేవునినుండి దూరమైతిమి." "కొద్ది కాలమైన తరువాత పాపముల విషయమై మారుమనస్సు పొంది దేవునివైపు తిరిగితిమి."

[21]Allen, 168. [22]పాపమువలన కలుగు లోకసంబంధమైన ఫలితాలు మార్చబడుతుంటాయి. దానివలన కలుగు ప్రయోజనాలు కూడా మారుతుంటాయి. "పాపము పాపమే" అనే ప్రాథమిక సత్యం నిలిచియుంటుంది. [23]క్రైస్తవుడగుటకు అవసరమైన షరత్తులను మరియు క్రైస్తవుడు పునరుద్ధరింపబడుటకు గల సూత్రాలను చర్చించుటకు యిది మంచి సమయం. [24]దేవుడు మారుమనస్సు దయచేయుటను గూర్చి మాట్లాడే లేఖన భాగాలు (అపొ. 5:30, 31; 11:18). అంటే, (1) మారుమనస్సు పొందడానికి దేవుడు అవకాశమిస్తాడు. (2) మారుమనస్సు పొందడానికి ప్రోత్సాహాన్ని యిస్తాడు. [25]McGarvey, 103. [26]వారికొరకు స్థలము సిద్ధపరచ వెళ్లుతున్నట్టు ప్రభువు తన శిష్యులకు తెలిపారు (యోహాను 14:2). [27]నరకం కూడ అపవాదికిని వాని దూతలకును "సిద్ధపరచినదే" (మత్తయి 25:41). [28]క్రైస్తవులగుట ఎలాగో వివరించు (అపొ. 2:38), తప్పిపోయిన దేవుని బిడ్డ ఎలా పునరుద్ధరింపబడవచ్చో తెలుపు (అపొ. 8:22) మారుమనస్సు మాత్రమే చాలదని – దేవుని చిత్తాన్ని జరిగించడానికి జరిగించవలసింది ఒకడు చేయవలసి యుంటుందని కూడ చెప్పాలి (Allen, 169-70).

# ఒక విశేషమైన సిరీస్ ముగియవచ్చింది

ఈ పరంపరములో మనము నలువదినాల్గు పాఠములను, అరవై కంటె ఎక్కువైన ప్రసంగాలను బైబిల్లోని నాల్గు పుస్తకాలపై చదివాము. ఈ నాల్గు పుస్తకాలు– మత్తయి, మార్కు, లూకా, యోహానుల సువార్త రచనలు. ఇవి ఎనబై తొమ్మిది అధ్యాయాలు కలిగియుండి క్రొత్తనిబంధనలోని నలపైయైదు శాతమైయుంది.

డేవిడ్ రోపర్‌గారు ఈ పాఠాలను సిద్ధపరచుటకు రెండు సంవత్సరాలపాటు ఎక్కువ సమయాన్ని గడిపారు. ఈ పఠనముకొరకైన అతని ప్రార్థనాపూర్వకమైన ద్వారానినీ, తెలివితో కూడిన లోతైన రచనను మేము అభినందిస్తున్నాము.

డాక్టర్. ఎడ్డీ క్లోయర్, సంపాదకులు.